# ఎన్నెల నవ్వింది!!

మ్యాజెర్సీ కళాసమితి, ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక నిర్వహించిన '97 కథల పోటీలలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

— జి.సురేష్‌బాబు

ఆ దృశ్యం ఆమెను పరవశింపజేస్తోంది. ఆ బస్సు వేగంగా దూసుకొనిపోతుంది. కిటికీ ప్రక్కనే కూర్చున్న ఆమెకు ఆ వేగానికి వస్తున్న చల్లని గాలి ఎంతో హాయినిస్తోంది. కళ్ళు అరమోర్పుడులవుతున్నాయి.

ఎదురుగా, దూరంగా కనిపిస్తున్న ఎత్తైన కొండల మధ్య నుంచి లేలేత కిరణాలను వెదజల్లుతూ బంగారు ఎరుపురంగుల మిశ్రమంగా, గిర్రున తిరుగుతున్నట్టుగా పైపైకి వస్తున్నాడు బాలభానుడు. మరోవైపు ఆ కిరణాల ప్రభావానికి చిరుచీకట్లు మెల్లగా తొలగిపోతున్నాయి. ఆ మనోహర దృశ్యాన్ని చూస్తుంటే ఆమెలోని అణువణువూ పులకరించిపోతూంది.

అంతలో బస్సు కీచుమంటూ ఆగింది. కండక్టర్, "కేతుగూడెం" దిగండమ్మా! అంటూ బద్ధకంగా అరిచాడు. ఆమె మెల్లగా లేచి బస్సు దిగింది. బస్సు వెనువెంటనే వేగాన్ని పుంజుకొని ముందుకు కదిలింది. ప్రక్కనే తెల్లటి బండరాయిపై నల్లటి వంకర అక్షరాలు 'కేతుగూడెం' అని వ్రాసి వుంది.

పక్షుల కిలకిలరావాలతో, చల్లటి గాలులతో ప్రకృతి పుడమికి మేలుకొలుపు పాడుతున్నట్లుగా వుంది.

దూరంగా కనిపిస్తున్న ఎత్తైన తాటిచెట్ల వైపు చూస్తూ, ఆ మట్టిదారి వెంట అడుగులు వేసిందామె. అడుగులు యాంత్రికంగా పడుతుండగా, ఆమె ఆలోచనలు గతాన్ని త్రవ్వసాగాయి. సరిగ్గా ఎనిమిది గంటల క్రిందట, ఆ ఎ.సి. బెడ్ రూంలో దుఃఖభరితమైన మనస్సుతో తాను వ్రాస్తున్న అక్షరాలు, కదలాడిన కాగితాలు ఆమె కళ్ళముందు ఒక్కసారిగా రెపరెపలాడాయి.

* * * * *

ప్రియమైన శ్రీవారు మాధవ్‌గారికి,

నేనండీ! మీ రమ్యను! మొరటు మనుష్యుల మధ్య, మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగిన మోటు 'ఎన్నెల'ను! చిరుగుల చీరను ఒంటికి సగం కప్పుకుని, తైల సంస్కారం లేని జుత్తుతో మీకు మట్టిలో మాణిక్యంలా కన్పించిన ఎన్నెలను! ఇప్పటి మీ ధనదాహం తీర్చేయంత్రాన్ని! కామదాహం తీర్చే మనసులేని యంత్రాన్ని! మీకు ఇలా వ్రాయవలసి వస్తుందని, వ్రాస్తానని నేను కలలో కూడా తలంచలేదు. కానీ వ్రాయక తప్పలేదు.

నా జీవన ప్రదాతా! ఒక్కసారి మన పరిచయాన్ని, నా గతాన్ని సింహావలోకనం చేసుకొంటాను!

ఇది ఆరు నెలల క్రిందటి కథ – ప్రస్తుతపు నా వ్యథ.

పల్లె అందాలను, పల్లెలో ప్రకృతిని చూసి ఆస్వాదించటానికి మా 'కేతుగూడెం'కు దాదాపు యాభై కిలోమీటర్ల దూరంలోని పట్నం నుంచి వారానికి రెండు మూడుసార్లు వచ్చేవారు మీరు. అలా వస్తూ, వస్తూ నన్ను చూశారు. నా ఛామన ఛాయ మిమ్మల్ని ఆకర్షించిందో నా బట్టల చిరుగుల్లో కన్పించే నా శరీరపు ఆకర్షణ మిమ్మల్ని మోహంలో పడవేసిందో మొత్తంమీద నాపై కన్నేశారు. మెల్లగా పథకం ప్రకారం, కల్లుతీసి అమ్ముకొనే మా నాన్న 'మునెయ్య'ను మచ్చిక చేసుకొన్నారు. మా వివరాలు సేకరించారు. కల్లు మీరు తాగారు. సీమ మందు మా నాన్నకు పోశారు. నన్ను రక్షిస్తానన్నారు. నన్నొక దేవతలాగా చూసుకొంటానన్నారు. మీ చీకటి జీవితం నా రాకతో వెన్నెల రాత్రిలా మారుతుందన్నారు. ఆ మాటలకో, లేక మీరు ఇచ్చే మందుకో మా నాన్న లొంగిపోయాడు. అంతేకాదు మాధవ్ గారూ! నేనూ ప్రలోభపడ్డాను. బాబుగారు (మీరు) మనుషుల్లో దేవుడనుకొన్నాను. మీ చల్లని నీడలో నా జీవితం నల్లేరు నడకలా సాగిపోతుందనుకొన్నాను. మా నాన్న కన్నీటి వీడ్కోలు మధ్య, ఆ పల్లెను వదిలి మీ అడుగులో అడుగువేశాను. మీ నీడలో నడిచాను.

కానీ మాధవ్! నాకా క్షణంలో తెలియదు. ఆ నీడ పడగనీడ అని!

పట్నంకు తీసుకొని వచ్చారు. పట్నంకు తగినట్లు మార్చావు. భాష నేర్పావు. రాత నేర్పావు. అందంగా ఉండటం, అందంగా మాట్లాడటం, అందంగా నవ్వడం, అందంగా అలంకరించుకోవటం నేర్పావు. ఆ అందమంతా నీకోసమే అని నేను భావించాను! బట్, యూ చీట్! నీవు మా గూడెంలో చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని తెలిశాక నా గుండెలు బ్రద్ధలయ్యాయి. మనసు ముక్కలయింది.


మాధవ్! పట్నంలో అయిదు అంతస్థుల భవంతికి అధిపతినన్నావ్! బ్రహ్మచారి నన్నావ్! నీ జీవితంలో ????? నేను.. యువతినన్నావ్! కానీ ఆ స్టార్ హోటల్‌లో నీవు ఒక రిసెప్షనిస్ట్‌వనీ, నీకు ఇద్దరు పిల్లలనీ, ఆ భార్య కూడా నీవు చేసే తప్పుడు పనులకు బలయిందనీ, ఆ బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకొందనీ తెలిసేసరికి, నీవేమిటో తెలిసివచ్చింది.

రేయ్! మాధవ్! నీ ధనదాహం కోసం నా జీవితాన్ని బలి చేస్తావా? నీవు ఎదగడం కోసం నన్ను దిగజార్చాలని చూస్తావా? ఎందుకురా నా జీవితంతో ఆడుకొన్నావ్? ఈ నాటకం కోసం, ఈ పథకం అమలు కోసం నీవు తీసుకొన్న టైం ఆరు నెలలు! ఈ మధ్యకాలంలో మా నాన్న నీ దగ్గర కొచ్చి నన్ను గురించి అడిగినా, కన్న కూతుర్నైన నన్ను ఒకసారి చూసి వెళ్ళిపోతానని బ్రతిమలాడినా, అవమానించి, తరిమేస్తావా? పాపం, మా నాన్న ఇప్పుడెక్కడున్నాడో? ఎలా ఉన్నాడో?

మాధవ్! నిన్నరాత్రి నీవు వెళ్ళగక్కిన విషాన్ని గూర్చి తలచుకొంటేనే భయంగా ఉంది. ప్రాణం తీసుకోవాలనుంది. కానీ నీలాంటి నీచుడి కోసం ప్రాణాలు తీసుకోవటం వ్యర్థం! ఎంటిరా నీవు చెప్పింది?

'చూడు రమ్యా! మనం ఈ నగరంలోకెల్లా గొప్ప ధనవంతులం కావాలంటే, తరాలకు కూడా తరగని ధనం సంపాదించాలంటే, నీవు ఈ పని చేయాలి. తప్పదు!' అని ఆ వివరాలు చెబుతుంటే నా రక్తం ఎలా సలసలా మరిగిపోయిందో తెలుసా?

ఆ వివరాలు, నీవు బాగా డబ్బున్నవారిని, నీ స్టార్ హోటల్‌లోకి తీసుకొచ్చి, వారి ప్రక్కలో నన్ను పడుకోబెట్టి, ఆ నీచ కార్యాలను రహస్యంగా వీడియో క్యాసెట్ తీసి, అటు ఆ క్యాసెట్లు అమ్ముతూ, ఇటు ఆ ధనవంతులను బ్లాక్‌మెయిల్ చేయాలంటావా? ఈవిధంగా ఒక్క ఏడాది చేస్తే చాలా!



ఛీ. దుర్మార్గుడా? నీవు నాకు భర్తవా? నీవు నాకు కట్టింది మాంగల్యమేనా? నీవసలు మనిషివేనా? నీలో ఉన్నది అసలు రక్తమేనా? విషమా? ఈ నీచ పథకం ఫలించడం కోసం నన్ను ఆరు నెలలుగా పెంచి పోషిస్తావా?

నేనూ మనిషినేరా? నాకూ ఓ మనసుంది! ఆ మనసులో ఓ హృదయముంది. దానికి పవిత్రత ఉంది. భారతీయ స్త్రీ కొండల్లో జీవించినా, పట్టణాల్లో బ్రతికినా వ్యభిచరించడానికి చచ్చినా ఒప్పుకోదు. ప్రాణం పోయినా అంగీకరించరు. ఒక వేళ అంగీకరించినా, అది మనసు చంపుకొని, శరీరాన్ని బొమ్మలా చేసి అప్పగిస్తారు.

మాధవ్! ప్రాధేయపడినా, కన్నీళ్ళు కార్చినా, కాళ్ళు పట్టుకొన్నా, ఎన్నిచేసినా నీ కఠిన హృదయం కరుగలేదు. అప్పడర్థమైంది నాకు, నీవొక రాక్షసుడివని! చెప్పినట్లు వినక తప్పదని, నీవు కఠినంగా కమాండ్ చేసి, నన్ను నిర్దాక్షిణ్యంగా గదిలోకి నెట్టి, తలుపులు బంధించి వెళ్ళిపోతుంటే నాకనిపించింది, నీవు అవకాశమొస్తే నీ తల్లిని, చెల్లినీ కూడా తార్చడానికి సిద్ధపడేంత నీచుడివని! యూ బ్లడీ బాస్టర్డ్!

అందుకేరా మాధవ్! నీవిచ్చిన ఈ హోదాని, నీవు నేర్పిన ఈ భాషనూ, నీవు పెట్టిన రమ్యమైన పేరునీ నీకే వదిలి, నీ జీవితం నుంచీ, నీ ముళ్ళ పంజరం నుంచీ, నీ కత్తుల బోను నుంచీ, నీ పడగ నీడ నుంచీ, నీ బంధిఖానా నుంచీ శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. నన్ను వెంబడించాలని ప్రయత్నించినా, నా ఆచూకీ కోసం వెదికించినా, జరిగేది ఏమిటో తెలుసా? నీ శవాన్ని చూసి... నా ప్రాణాలు వదుల్తారా? ఖబడ్దార్!

ఇట్లు,
నీ కేమీకాని,
ఎన్నెల.

* * * * *

"బోయ్!"మంటూ దూరంగా ఉన్న పట్టాలపై వెళ్తున్న రైలు కూత పెట్టిన శబ్దానికి ఉలిక్కిపడి వర్తమానంలోకి వచ్చిందామె! రమ్యా... కాదు.. కాదు... ఎన్నెల! స్వచ్ఛమైన ఎన్నెల!

దాదాపు గూడెం దరిదాపుల్లోకి వచ్చేసిందప్పటికి! అపురూపంగా, ఆప్యాయంగా, అభిమానంగా, ఆరాధనగా, ఆర్తిగా తనకు జన్మనిచ్చిన నేల, తను ఆడిపాడిన నేల, తన ఆలనా పాలనా చూసిన నేలను చూసుకొంది ఎన్నెల!

ఆరు నెలలు! అప్పటికి ఆమెకు ఆరు యుగాలైనట్లుంది! ఆ పచ్చని చెట్లు, ఆ పక్షుల కిలకిలా రావాలు, ఆ మూగ జీవుల పలకరింతలు... అన్నీ ఆమెను పలుకరిస్తుండగా, అన్నీ ఆమెను పులకరింపజేస్తుండగా... నవ్వుతూ... తుళ్ళుతూ... ఆనందిస్తూ... పాత ఎన్నెలలా మారిపోతూ... ఆకులో ఆకుగా... కొమ్మలో కొమ్మగా.... ఆ ప్రకృతిలోకి, ఆ నేలలోకి పరుగులీసింది ఎన్నెల! స్వచ్ఛంగా, స్ఫటికంలా, సంతోషంగా నవ్వుతూ ఎన్నెల!

